

## సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

**సిరికొండ, సెప్టెంబర్ 15 :**

నిజామాబాద్ కమిషనర్ ఆదేశాల మేరకు సిరికొండ పోలీస్ ఆధ్వర్యంలో తాళ్ల రామడుగు గ్రామంలో గ్రామస్థుల కోసం సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జనహిత పరస్పర సంకేతాలతో సాగిన ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ అంజూ ప్రధానంగా మాట్లాడుతూ, సైబర్ నేరాల తీరుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కానిస్టేబుల్ అంజూ వివరించారు, అపరిచితులు వీడియో కాల్ చేసి డబ్బులు అడగవచ్చని, ఫోన్ ద్వారా ఓటీపీ అడిగితే ఎవరితోనైనా పంచకూడదని, అలాగే ఫోన్‌లో లింకులు పంపి "ఈ లింక్ ఓపెన్ చేయండి" అంటే ఆ లింక్‌ను తెరవడం వల్ల బ్యాంక్ ఖాతాలోని డబ్బులు మాయమయ్యే ప్రమాదం ఉందని. అందువలన సూచించని లింకులను ఎప్పుడూ ఓపెన్ చేయవద్దని, ఏదైనా అనుమానాస్పద నేరక్రియ జరిగితే వెంటనే పోలీస్ స్టేషన్కు ఫిర్యాదు చేయాలన్నారు. అదేవిధంగా, డబ్బులు అకస్మాత్తుగా ఖాత నుంచి వెళ్లిపోయినట్లయితే 1930 నంబర్‌కు కాల్ చేసి వివరాలు నమోదు చేసుకోవడం ద్వారా నేరగాళ్ల అకౌంటు ఫ్రీజ్ చేయించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. తదుపరి, అమ్మాయిలు ఎప్పుడూ అన్యసంబంధ వ్యక్తుల నుంచి అపహాస్య లేదా అత్యంత వ్యక్తిగత సమాచారాన్ని పంచరాదు, సోషల్ మీడియా ప్రొఫైల్లలో గోప్యతా సెట్టింగ్స్‌ను సరిచూడాలి, తెలియని వ్యక్తులను ఫాలో చేయరాదు అని కూడా సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ రమేష్ కుమార్, నవీన్, తేజ నాయక్ పాల్గొన్నారు



## ఘనంగా జాతీయ ఇంజనీర్ల దినోత్సవ వేడుకలు

**రాయికల్, సెప్టెంబర్ 15 :**

రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో జాతీయ ఇంజనీర్ల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మచ్చ గంగాధర్, డైరెక్టర్లు మచ్చ లలిత, విద్యాన్వేష్, ఉపాధ్యాయులు మహేష్, రంజిత్, అప్సర్, షారూ, రజిత, సంజన, ఇందుజ, మంజుల, శ్రీజ, సౌజన్య, నిహారిక, కవిత, స్రవంతి, సాయి హర్ష, మమత, అనూష తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ

**ఎడపల్లి, సెప్టెంబర్ 15 :**

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సోమవారం ఎడపల్లి గ్రామంలో లబ్ధిదారుల కోసం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రివర్యులు, బోధన్ శాసనసభ్యులు పి సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎడపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లబ్ధిదారులు ముగ్గు వేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఇరేటి లింగం, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎస్ కె ఫరాన్, బోధన్ సహకార సంఘం డైరెక్టర్ కే సత్యనారాయణ, నాయకులు బంజ కామప్ప, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## చదివిన పాఠశాలకు యూత్ సహాయం

**ధర్పల్లి, సెప్టెంబర్ 15 :**

వాడి గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా చెరువు తెగిపోవడంతో ప్రభుత్వ పాఠశాలకు వరద నీరు చేరి సామాగ్రి దెబ్బతిన్నది. ఈ విషయాన్ని గమనించిన యువతరం యూత్ అసోసియేషన్ సభ్యులు ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించారు. సోమవారం రూ.10,000 ఆర్థిక సహాయాన్ని ప్రధానోపాధ్యాయులు ప్రసన్న కుమార్ కు విడిసి చైర్మన్ జిన్నా సాయిలు ఆధ్వర్యంలో యూత్ అధ్యక్షులు పడకంటి మహేందర్, సభ్యులు అందజేశారు. అధ్యాపకులు పడకంటి మహేంద్ర మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవడం ప్రతి పూర్వ విద్యార్థి బాధ్యత. రాబోయే రోజుల్లో కూడా అవసరమైన సహాయం అందిస్తాం" అని తెలిపారు. కార్యక్రమంలో విడిసి సభ్యులు గంగారం, సంతోష్, యూత్ సభ్యులు నవీన్, శ్రీకాంత్, రుతిక్, సృజన్, రమేష్, బాల్రాజ్ పాల్గొన్నారు.

# విద్యావ్యవస్థలను కాపాడాలి

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15 :**

ఇంజినీర్స్ డేను తెలంగాణ విద్యా వ్యవస్థలో బ్లాక్ డేగా గుర్తిస్తూ చింతల్ భాగ్యరథి డిగ్రీ కాలేజీ, రాయల్ డిగ్రీ కాలేజీలు సోమవారం బంద్ పాటించాయి. మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళి అర్పించిన తరువాత, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యపై నిరవధిక సమ్మెకు మద్దతు ప్రకటించారు. కాలేజీల సమస్యలు ₹1,200 కోట్లు ఇప్పటికే ఆమోదించబడినప్పటికీ విడుదల చేయకపోవడం, గత నాలుగు సంవత్సరాల పెండింగ్ బకాయిలు ఇంకా చెల్లించకపోవడం, అధ్యాపకులు, సిబ్బంది వేతనాలు అనేక నెలలుగా బకాయిగా ఉండటంతో, వారి కుటుంబాలు ప్రాథమిక అవసరాలు తీర్చలేని పరిస్థితి, పాఠశాలలు, కళాశాలలు దసరా పండుగ సీజన్‌లో మూసివేయడం వల్ల విద్యార్థుల విద్యా కార్యకలాపాలు తీవ్రంగా దెబ్బతినడం, ఆర్థిక సమస్యల కారణంగా అకాడమిక్ కార్యకలాపాలు ఆగిపోవడం, బోధనా వాతావరణం స్తంభించిపోవడం, ప్రస్తుత పరిస్థితులు మానవతా సంక్షోభంగా మారడం, విద్యార్థులు, సిబ్బంది, మేనేజ్‌మెంట్ అంతా ఇబ్బందుల్లో పడటం, ప్రభుత్వం నుంచి స్పష్టమైన చర్యలు లేకపోవడం, కేవలం సమావేశాలు, హామీలతో కాలం గడపడం. డిమాండ్లు: బడ్జెట్ కేటాయింపులో ఉన్న మొత్తాలను తక్షణం విడుదల చేయాలి, అన్ని పెండింగ్ బకాయిలను 2025 డిసెంబర్ 31లోగా క్లియర్ చేయాలి, కొత్త రీయింబర్స్‌మెంట్ విధానంపై స్పష్టత నిచ్చే జీవో విడుదల చేయాలి, 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను 2026 మార్చి 31లోగా చెల్లించాలనా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మా డైరెక్టర్లు నల్ల జై శంకర్ గౌడ్, రమేష్ బాబు, అలాగే రెండు కళాశాలల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.





## వడ్డెర కాలనీలో ఘర్షణ : 10 మందిపై కేసు

**మోపాల్,సెప్టెంబర్ 15 :**

నిజామాబాద్ రూరల్ మోపాల్ మండలంలోని వడ్డెర కాలనీలో ఘర్షణ సంభవించి, నిజామాబాద్ పట్టణానికి చెందిన 10 మంది వ్యక్తులపై కేసు నమోదైంది. మోపాల్ ఎస్.ఐ. వివరాల ప్రకారం, ఆదివారం సాయంత్రం సుమారు 5 గంటలకు మోపాల్ మండలంలోని వడ్డెర కాలనీ చెరువు కట్ట వద్దకు తిరిగి వెళ్తున్న 12 మంది నిజామాబాద్ పట్టణ నివాసులు అక్కడి ముగ్గురు వడ్డెర కాలనీ నివాసులను అనవసరంగా దూషించి, దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనను గమనించిన గ్రామస్తులు మధ్యలో చేరి గొడవను ఆపి, దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే మోపాల్ ఎస్.ఐ. 10 మందిపై కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపారు, ఓపెన్ డ్రింకింగ్ చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కెలిగించడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబడదని, ఇలాంటి ఘటనల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ఇంజినీర్ కు సన్మానం

**చేగుంట, సెప్టెంబర్ 15 :**

మెదక్ జిల్లా, చేగుంటలో నిర్వహించిన ఇంజినీరింగ్ డే కార్యక్రమంలో చేగుంట మండల హౌసింగ్ ఏఈ రియాజ్ ను తహసీల్దార్ శ్రీకాంత్, ప్రముఖ సంఘ సేవకులు పరంజ్యోతి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సంద్రగు రాములు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు



## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**చేగుంట, సెప్టెంబర్ 15 :**

మెదక్ జిల్లా, చేగుంట మండలంలో మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నారెడ్డి, ఎంఈఓ నీరజ, తాసిల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో చిన్నారెడ్డి పాల్గొని ఉపాధ్యాయ వృత్తి ప్రాముఖ్యతను గుర్తుచేశారు. ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంఈఓ నీరజ మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి సమాజ నిర్మాణానికి కీలకమైనదని, దేశ భవిష్యత్తు తరగతిగదులలో గడపడంలో ప్రధాన పాత్రధారి అని పేర్కొన్నారు. తాసిల్దార్ శ్రీకాంత్ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది, అపూర్వమైనది, అన్ని వృత్తులనూ రూపొందించే ఏకైక వృత్తి అని అన్నారు. మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎం అనిత, ఎం శ్రీవాణి, ఎన్. సంతోషి, ఎన్. ధనుంజయ, కే సునీత, పి భవాని, ఎస్.బి.ఆర్ సరస్వతి, ఎంఏ నయీమ్, జీ.శారద, సౌజన్య, రమ్యశ్రీ, ఆర్ సత్యనారాయణ, కే విజయేంద్ర రెడ్డి, టి రాములు, కే మురళీకృష్ణ, బి శంకర్రావు, పి ఊర్మిళ, టి ఎల్లయ్య, వి కిషన్ ఎంపికయ్యారు. జిల్లా అవార్డు గ్రహీతలుగా జీ రాధా, ఎన్. శంకర్, ఎం శ్రీలత, సి ఆర్ పి రమేష్, ప్రవీణ్, వినోద్లను సన్మానించారు. కార్యక్రమంలో పిజిహెచ్ఎంలు అమర్ శేఖర్ రెడ్డి, చంద్రకళ, కృపాకర్ రెడ్డి, కృష్ణారావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కే. పెంటా గౌడ్, గజగట్ల నాగరాజు, మణిరామ్, రావుల వెంకటేష్, నరసింహారావు, మల్లికార్జున్, మనోహర్రావు, తిరుపతి రెడ్డి, నగేష్, తంగేళ్లపల్లికి కృష్ణమూర్తి, బాల్ పోచయ్య, రాజశేఖర్, విభిన్న సంఘాల నాయకులు తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, పాండు, వెంకట్రాంరెడ్డి, విట్టల్ రెడ్డి, సలీం, రమ, వనిత, సుధాకర్, సిద్ధిరాములు, యాదగిరి, చల్ల రామకృష్ణ, శ్రీనివాస్, పరశురాం, రమాదేవి పాల్గొన్నారు.

# పోషణ మాసం కార్యక్రమాలు పక్కగా అమలు చేయాలి

**నిజామాబాద్ , సెప్టెంబర్ 15 :**



పిల్లల పెరుగుదలకు, పోషణ లోపం తగ్గించడానికి, బరువు లోపం లేకుండా పోషక ఆహారాలను అందించడంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా, నిజాయితీగా పని చేయాలని జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుండి ప్రారంభించనున్న పోషణ మాసం కార్యక్రమాన్ని పురస్కరించుకుని, సమీకృత జిల్లా కార్యాలయాల మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం సాయంత్రం కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పోషణ మాసం కార్యక్రమాల అమలును సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ సూచనల ప్రకారం, అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన సేవలు అందించాలి. రక్తహీనత, పౌష్టిక ఆహార లోపంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం, చిన్న పిల్లలు, మహిళల్లో పోషకాహార లోపాలను గుర్తించి పరిష్కరించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. చక్కర, నూనె, ఉప్పు మోతాదుకు మించి వాడకూడదని, జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. జిల్లా అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రతి పిల్ల యొక్క ప్రస్తుత బరువు, వాస్తవ బరువు వివరాలను నమోదు చేయడం, రక్తహీనత రాకుండా తగిన చర్యలు చేపట్టడం సూచించారు. అంగన్వాడీ టీచర్లు, సహాయకులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, వార్డ్ ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు సమన్వయంతో పనిచేయాలని, గ్రామ సభల్లో పోషకాహార మాసాన్ని నిర్వహించి, ఆరోగ్యకర జీవనశైలిని అవగాహనతో అలవరచేలా చేయాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, డీఆర్డీఓ సాయాగౌడ్, డీడబ్ల్యూఓ రసూల్ బీ, డీఎంహెచ్ఓ రాజశ్రీ, డీఈఓ అశోక్, ఐసిడిఎస్–సీడీపీఓలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## తహసీల్ కార్యాలయాన్ని ముట్టడించిన దివ్యాంగులు

**శెనార్తి మీడియా, శంకరపట్నం :**

వికలాంగుల పెన్షన్‌ను రూ.6,000కు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత కార్మికులు, బీడీ కార్మికుల పెన్షన్‌ను రూ.4,000కు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దివ్యాంగులు శంకరపట్నం తహసీల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కొత్తగా దరఖాస్తు చేసిన వారికి వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో పెన్షన్లు పెంచుతామని వాగ్దానం చేసినప్పటికీ, 22 నెలలు గడిచినా అమలు చేయకపోవడం మోసమని విమర్శించారు. తరువాత తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కనుకుంట్ల శ్రీనివాస్ మాదిగ, ఇంచార్జ్ అంబాల మదనయ్య మాదిగ, ఎంఎస్పి మండల అధ్యక్షుడు కలకోట సమయ మాదిగ, సీనియర్ నాయకులు రామగిరి భూమన్న మాదిగ, మేకల కుమార్ మాదిగ, ఆడపు బిక్షపతి మాదిగ, కనకం శంకరయ్య , దాసరపు భద్రయ్య మాదిగ, శనిగరపు మహేష్, జాలి రాంరెడ్డి, విహెచ్పిఎస్ నాయకులు సమ్మన్న, గడ్డం రమేష్, రామగిరి తిరుపతి, నాత్రి సమ్మయ్య, బొజ్జ లింగస్వామి, దేవనూరు వీరయ్య, స్వరూప జ్యోతి, మంజులతో పాటు వికలాంగులు, వృద్ధులు, వితంతువులు పాల్గొన్నారు.





## కోతులను తరిమేందుకు ఏకమవుతున్న గ్రామస్తులు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

గ్రామాల్లో కోతుల బెడద రోజురోజుకీ పెరుగుతోంది. ఒకప్పుడు సర్కస్‌లలో లేదా కొండగట్టులో అరుదుగా కనిపించే కోతులు ఇప్పుడు వాడ వాడా గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. వృద్ధులు, పిల్లలపై దాడులు చేయడం, వండిన ఆహారం గిన్నెలతో సహా లాక్కెళ్లడం, ద్విచక్ర వాహనాల్లోని వస్తువులను దోచుకెళ్లడం తరచూ జరుగుతున్నాయి. ఇటీవల లింగాపూర్‌కు చెందిన ఓ మహిళపై దాడి చేసి రెండు చేతులు విరిగేలా చేసిన ఘటన స్థానికులను మరింత భయభ్రాంతులకు గురిచేసింది. ప్రతిరోజూ గాయపడిన వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆశ్రయించడం సాధారణమైంది. ప్రజాప్రతినిధులు లేకపోవడం వల్ల సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియక గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితులను తట్టుకోలేక శంకరపట్నం మండలంలోని కరీంపేట గ్రామ ప్రజలు ఏకమయ్యారు. ప్రతి ఇంటి నుంచి ఒకరు కర్రలు పట్టుకుని బయటికి వచ్చి కోతులను తరిమికొట్టాలని గ్రామ పెద్దలు పిలుపునిచ్చారు. యువకులు ఊరు చుట్టూ కాపలా కాసి కోతులను పొలిమేరల వరకు తరిమేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ చెట్లపై పొదల మధ్య దాక్కుని కోతులు తిరుగుబాటు చేస్తున్నాయి. కోతుల బెడదతో మానసిక ప్రశాంతత కోల్పోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ సమస్య ప్రధాన అంశంగా మారే అవకాశముందని వారు పేర్కొన్నారు.

## 17న విరాట్ విశ్వకర్మ యజ్ఞం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల ఆవరణలో సెప్టెంబర్ 17వ తేదీ ఉదయం 10.30 గంటలకు విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం నిర్వహించనున్నట్టు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ. పురుషోత్తం తెలిపారు. అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.